క్లుప్తంగా

కబడ్డీ విజేతగా చియ్యపాడు జట్టు



చియ్యపాడు జట్టుతో అధికారులు, గ్రామస్తులు

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో చియ్యపాడుకు చెందిన జట్టు గెలుపొందింది. మదూరు, ఎన్.ఓబాయపల్లె, వెదురూరు జట్లతో తలపడిన చియ్యపాడు జట్టు విజేతగా నిలిచింది. దీంతో చియ్యపాడు జట్టు త్వరలో నియోజకవర్గ స్థాయిలో జరుగనున్న ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి ఉందని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

23న పల్లవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలోని గ్రామ సచివాలయ భవన సముదాయం వద్ద ఈ నెల 23న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో ఐదు మంది ప్రత్యేక వైద్య నిపుణులతో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేయటం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

నియామకం



జేష్టాది రవికుమార్

మైదుకూరు : జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన జేష్టాది రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు, రవికుమార్‌కు ఉత్తర్వులు పంపారు. తనను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డిలకు రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ రామకృష్ణ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రెడ్డిసురేష్ మైలవరం మండలానికి బదిలీ అయ్యారు. 2009 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ కడప తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమస్యాత్మక వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా పెడతామన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలోని వివిధ కేటగిరీలలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప రీజినల్ సెక్రటరీ రఘునాథరెడ్డి కోరారు. బుధవారం ఆర్ఎం కార్యాలయం వద్ద వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కనీసం రూ. 5 వేల జీవనభృతిని మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశానికే తలమానికంగా అంబేద్కర్ విగ్రహం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నాయకులు

బద్వేలు అర్బన్ : విజయవాడలోని స్వరాజ్య మైదానంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన 206 అడుగుల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాంస్య విగ్రహం దేశానికే తలమానికంగా నిలవనుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో జరగనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.వినోద్‌కుమార్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి.. అందరివాడైన అంబేడ్కర్ స్మృతివనాన్ని అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేశారన్నారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి కులమతాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రమణమ్మ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, ఎస్సీ కమిషన్ మెంబర్ సగిలిసుదర్శన్, పోరుమామిళ్ళ, బి.కోడూరు జెడ్పీటీసీలు ముత్యాలప్రసాద్, సంగటిదావీదు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాలవెంకటేశ్వర్లు, జిల్లా జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, మానవహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు ప్రసాద్‌రావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ నారాయణ, ఎస్సీ సెల్ నాయకులు తిరుపాల్, మల్లికార్జున, రవి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ప్రజాస్వామ్యవాదులకు శుభదినం

ప్రొద్దుటూరు క్రైం : విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించం ప్రజాస్వామ్య వాదులకు శుభదినమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. సాయికుటీర్ రోడ్డులో విజయవాడకు వెళ్లే కార్యక్రమ ఏర్పాట్లపై ఎమ్మెల్యే బుధవారం సమావేశం నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబిస్తూ విజయవాడలోని 19 ఎకరాల సువిశాల మైదానంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19న ఆవిష్కరణ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. దేశంలోనే ఇంత ఎత్తయిన విగ్రహం మరెక్కడా లేదన్నారు. ప్రపంచ పర్యాటకులు ఆకర్షించేలా మ్యూజికల్ ఫౌంటెన్, లైబ్రరీ, మ్యూజియం, కన్వెన్షన్ సెంటర్, అంబేద్కర్ జీవిత విశేషాలను తెలియచేసే ఏసీ థియేటర్‌ను స్మృతి వనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు చోట్ల ఫోటో షూట్, విశ్రాంతి గదులు కూడా ఇందులో ఉన్నట్లు చెప్పారు. పండుగ వాతావరణంలో విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి దళిత నాయకులు, ప్రజలే గాక అగ్రవర్ణాలకు చెందిన ప్రజాస్వామ్య వాదులు పాల్గొననున్నట్లు చెప్పారు.దళిత జాతిలో జన్మించిన డాక్టర్ అంబేడ్కర్ భారతదేశానికి ముద్దుబిడ్డ అయ్యాడన్నారు. ప్రొద్దుటూరు నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐదు బస్సుల్లో సుమారు 250 మంది విజయవాడకు వెళ్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరులోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు వారి సొంత వాహనాల్లో విజయవాడకు చేరుకుంటారన్నారు.

అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు

- పెండింగ్ పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి
- చర్చిల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చాపాడు కూడలిలోని నిర్మించనున్న అల్లాడుపల్లె రైతు సహకార సంఘం భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌కు మండల పరిషత్ సమావేశంలో తీర్మానించి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. దీని ద్వారా రైతులతో పాటు వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో నూతన హైస్కూల్ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత ఉన్నతాధికారి మాట్లాడి కాంట్రాక్టర్‌కు సూచించారు.

చాపాడు, బద్రిపల్లె చర్చి నిర్మాణాలకు నిధులు మంజూరు

మండల కేంద్రమైన చాపాడుతోపాటు బద్రిపల్లె గ్రామంలోని దళితవాడల్లో చర్చిలను నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. చాపాడులో చర్చికి రూ.12లక్షలు, బద్రిపల్లెలో నిర్మాణంలో ఉన్న చర్చికి రూ.6లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వీటితోపాటు నియోజకవర్గంలో పలు గ్రామాలలో ఉన్న చర్చిలకు సైతం నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య, జెడ్పీటీసీ శాంతురాజు, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, పీఆర్ ఏఈ ఈశ్వరయ్య, సొసైటీ సీఈఓ జాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

నివాళి

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ సోమిరెడ్డిపల్లె సర్పంచ్ ఎం.రామయ్య(70) అనారోగ్యంతో మృతి చెందారు. పంచాయతీ వార్డు మెంబర్ ఎల్లటూరు చంద్రశేఖర్ రెడ్డి(42) గుండె పోటుతో మృతి చెందాడు. ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి బుధవారం నరసన్నపల్లె ఎస్సీ కాలనీలో సర్పంచ్ రామయ్యకు పూలదండ వేసి నివాళి అర్పించారు. అలానే వార్డు మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. మైదుకూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-2 దరఖాస్తుల గడువు పొడిగించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వం గ్రూప్-2 దరఖాస్తుల గడువును పొడిగించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ తెలిపారు. బుధవారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్-2 వెబ్ సైట్ పనిచేయకపోవడంతో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేక పోయారన్నారు.

చాలా మంది నిరుద్యోగులు నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే గ్రూప్- 2 దరఖాస్తులకు గడువు పొడిగించాలని కోరారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి

ప్రొద్దుటూరు : విజయవాడలో ఈనెల 19న 206 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణను, స్మృతి వనం, గ్రంథాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్, జిల్లా కార్యదర్శి మేకల సుధాకర్ తెలిపారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలందరి అభ్యున్నతి కోసం అతి పెద్ద రాజ్యాంగాన్ని అంబేడ్కర్ అందించారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆయన విగ్రహాన్ని, స్మృతి వనం, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోపవరం : బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాలకు సంబంధించి గురువారం ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్‌పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం.కుళాయప్ప, బద్వేలు రూరల్ ఏఈ చిన్నయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కె.వి. బద్వేలు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులు, వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని వారు కోరారు.

కొనసాగుతున్న సమ్మె

ప్రొద్దుటూరు : ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె బుధవారం 37వ రోజుకు చేరింది. స్థానిక శివాలయం సెంటర్‌లో వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. వీరికి కొవ్వూరు బాలచంద్రారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, కృష్ణవేణి, లక్ష్మీదేవి, రాజి, విజయ, గురుదేవి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, బీసీ సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో మేలుకో బీసీ ప్రజా తంత్ర రాజకీయ చర్చా వేదిక నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు కలసికట్టుగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని అన్నారు. రాజకీయాల్లో ఎదుగుతున్న బీసీలకు సహకరించాలని కోరారు. బీసీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని అన్నారు. వారికి రాజ్యాధికారం కల్పించే దిశగా చర్యలు తీసుకోలేదని చెప్పారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి మాట్లాడుతూ బీసీలు అంటే వెనుకబడిన వారు కాదని, అన్ని రంగాల్లో రాణించే నేర్పు వారికి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పాణ్యం సావిత్రమ్మ మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం పొందినప్పుడే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని తెలిపారు. మల్లేల భాస్కర్ మాట్లాడుతూ రాజకీయ రిజర్వేషన్లు ఇస్తే తప్ప బీసీలు అభివృద్ధి చెందే పరిస్థితి లేదన్నారు. బీసీ నాయకులు బొర్రా రామాంజనేయులు, సందు శివనారాయణ, చౌడం కొండయ్య, చెన్నా వెంకటకృష్ణయ్య, పాణ్యం సుబ్బరాయుడు, కృష్ణయ్య, జింకా సుబ్రహ్మణ్యం, బడిగించల చంద్ర మౌళితోపాటు పలువురు బీసీ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ఆధారాలు లేకుండా రూ.లక్షల్లో నగదు వెంట తీసుకెళ్లొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : తగిన ఆధారాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదును వెంట తీసుకెళ్లరాదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని ఛైర్మన్ చాంబర్‌లో బుధవారం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయన్నారు. ఇందుకు సంబంధించి వచ్చే నెలలో నోటిఫికేషన్ రానుందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఎన్నికల కమిషన్ తన విధులను అన్ని కోణాల్లో వేగవంతం చేసిందన్నారు. ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక కేంద్రాలు, బందోబస్తు తదితర పనులను కొన్ని నెలల ముందు నుంచే చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రజలకు కొన్ని ఇబ్బందులు ఎదురౌతాయన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తే పోలీసులు సీజ్ చేస్తారని చెప్పారు. నోటిఫికేషన్ రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని, ప్రజా అవసరాల విషయంలో పోలీసు అధికారులు అత్యుత్సాహం చూపరాదన్నారు. వ్యాపారాలు, కుటుంబ అవసరాల కోసం, పెళ్ళిళ్లు, తదితర శుభకార్యాల కోసం రూ. లక్షల్లో డబ్బు తీసుకెళ్తుంటారన్నారు. ఇలాంటి వారిని ఇబ్బంది పెట్టవద్దని పోలీసు అధికారులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ప్రజల జీవన విధానానికి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ

స్థానిక 39వ వార్డులోని పఠాన్ కాలేజి వద్ద గల హనమాన్‌నగర్‌లో రూ. 50 లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు, డ్రైనేజి కాలువ, కల్వర్టు కోసం బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కారదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వార్డు కౌన్సిలర్ చింపిరి అనిల్‌కుమార్,జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ జేష్టాది శారద, దళిత సంఘాల నాయకులు గోసామనోహర్, సుధాకర్ మాదిగ, నరసింహ, యాకోబు పాల్గొన్నారు.

కన్వీనర్లు కీలకపాత్ర పోషించాలి

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు సచివాలయాల కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్‌బీ ఫంక్షన్ హాలులో బద్వేలు మున్సిపాలిటీ, బద్వేలు రూరల్, గోపవరం మండలాల సచివాలయ కన్వీనర్లు, బూత్‌కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో వేరువేరుగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రతిఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకుని సైనికుల్లా పనిచేయాలన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించారేమో గమనించాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు ఏయే కుటుంబాలకు ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్ల ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు అల్లాబకాష్, కేశవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, సాయికృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, బద్వేలు, గోపవరం మండలాల కన్వీనర్లు మల్లేశ్వర్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు



ఎరువుల దుకాణంలో తూకాలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ హెచ్చరించారు. బుధవారం టి.వి.మోహన్‌రాజ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. గడువు తీరిన పురుగు మందులు, గడ్డ కట్టిన పాత ఎరువులు రైతులకు విక్రయించవద్దని, 15 రోజులకొకసారి స్టాకు వివరాలను వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల కోసం వచ్చిన రైతుల వివరాలు సేకరించి బయోమెట్రిక్ వేయించడంతో పాటు ఎమ్మార్పీ ధరలకు మించకుండా అమ్మకాలు జరపాలన్నారు. ఎరువుల బస్తాల తూకాల్లో అనుమానాలు ఉంటే రైతులు తూకం వేసి చూసుకునే వెసులుబాటు కల్పించాలని డీలర్లకు తెలిపారు. కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, ఎరువుల నిల్వలు, ఇన్‌వాయిస్, లైసెన్స్ గడువు, బయోమెట్రిక్ ఈ-పాస్ మిషన్, తూకాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : మండలంలోని అమృతానగర్‌లోని 5వ వీధి వాసులు తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం కొత్తపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. 5వ వీధి వాసులు మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురికి నీరు ఇళ్ల చుట్టు చేరుతోందని, జ్వరాల బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. డ్రైనేజీ కాలువలను నిర్మించాలని కోరారు. వీధిలో పైపులైన్ ఒక పక్కనే ఉండటంతో నీరు పట్టుకునేందుకు సమయం సరిపోవడం లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో శ్రీను, నాగలత, పక్కీరమ్మ, వెంకటసుబ్బమ్మ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

గోపవరం : ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే కులగణనపై సర్వే పారదర్శకంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ సిబ్బందిని ఆదేశించారు. వలంటీర్, సచివాలయ సిబ్బంది వెళ్లి నిర్దేశిత ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో సర్వే చేయడంతో పాటు కుటుంబ సభ్యులు ఎవరో ఒకరి చేత బయోమెట్రిక్ వేయించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు ఎట్టిపరిస్థితుల్లోను అడగవద్దని, నిర్వహించే సర్వే అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. కులగణనలో ప్రతి కుటుంబం పాల్గొని అవసరమైన సమాచారాన్ని సిబ్బందికి ఇవ్వడంతో పాటు వారికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సర్వేకు సంబంధించి ప్రజాప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు కులగణనపై సమీక్ష : కులగణన సర్వేకు సంబంధించి గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో సమీక్ష సమావేశం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి నాగరాజ తెలిపారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మైదుకూరు : ప్రియ మిత్రులారా.. ఎలా ఉన్నారు.. ఏం చేస్తున్నారు.. పిల్లలు ఎంత మంది.. ఈ విధంగా ప్రశ్నల పరంపర సాగింది. మైదుకూరులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995 - 96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల మధ్య పట్టణంలోని ఎస్‌సీసీఆర్ కల్యాణ మండపంలో బుధవారం 1995 - 96 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉద్యోగ రీత్యా, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో ఉన్న వారంతా కుటుంబాలతో సహా వచ్చి ఒక చోట చేరారు. మైదుకూరు హైస్కూళ్లలో 28 ఏళ్ల కిందట చదువుకున్న తాము ఎక్కడున్నది.. ఏమి చేస్తున్నది ఒకరికొకరు చెప్పుకున్నారు. పాత జ్ఞాపకాలు తెలియజేసుకున్నారు. ఆనందాన్ని పంచుకున్నారు. చదువు చెప్పిన గురువుల సందేశాన్ని విన్నారు. వారిని గౌరవ భావంతో సత్కరించారు. గురువులతో కలసి అందరూ గ్రూప్ ఫొటో దిగారు. మళ్లీ తప్పకుండా కలుసుకోవాలని తీర్మానించారు.

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని గూడూరు అప్పయ్య గారి సుబ్బరాయుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 2008 - 09 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరుపుకున్నారు. అప్పటి విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు కలుసుకుని నాటి జ్ఞాపకాలను విద్యార్థులు చదువుకున్న తీరును నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయుడు జయరామిరెడ్డి మాట్లాడుతూ తాము విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు నేడు సమాజంలో కుటుంబం.. పిల్ల పాపలతో గడపడంతోపాటు ఉన్నత స్థాయికి చేరుకోవటం ఆనందకరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారానే ఉపాధ్యాయులు సంతోషిస్తారన్నారు.



చాపాడు హైస్కూల్‌లో 2008-09 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బద్వేలు అర్బన్ : మూడు దశబ్దాలకు పైబడిన అనుబంధం వారిది. ఎప్పుడో చిన్నప్పుడు కలిసి చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులంతా బుధవారం కలుసుకున్నారు. చదువుకునే రోజుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని సాధన ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1983-84 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక ఉల్లాసంగా సాగింది. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. అలాగే తమ స్నేహానికి నిదర్శనంగా ఏర్పాటు చేసిన ఫ్రెండ్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఫ్రెండ్స్ సేవా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లాయం యోగయ్య, గంగసానిసాంబశివారెడ్డి, కోశాధికారి సముద్రాలశ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సి.వి.సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, బ్రహ్మరెడ్డి, గౌరవ సలహాదారులు ఆనంద్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

